

# బాబోయ్ డబ్బు

- పెన్మెత్స శ్రీకాంత్‌రాజు

కథల పోటీలో
ద్వితీయ
బహుమతిగా రూ.5,000
పొందిన కథ

**రాజయ్యకు తను విన్నది నిజమేనా... అన్న అనుమానం వచ్చింది.**

**"ఎంతన్నావు?!..." అడిగేడు మళ్ళీ...**

**"ఎకరాకి పాతిక లక్షలిస్తానన్నాడు. నువ్వు కాదూ కూడదంటే... ముప్పయ్ వరకూ ఇవ్వొచ్చు..." చెప్పేడు అచ్చారావు.**

**"ఏటి... లచ్చలే?!..." ఇంకా అనుమానం చావ లేదు రాజయ్యకి.**

"అవును రాజయ్యా... లక్షలే! నీ పొలం మెయిన్‌రోడ్డుకు చేర్చి ఉంది. టవునుకు మనూరు పట్టుమని పది కిలోమీటర్లన్నా లేదు. లే అవుట్ వేసి అమ్మితే ఎగరేసుకుపోతారు... నీ కొడుకుల్తోటి ఆలోచించి చూడు..." సలహా ఇచ్చాడు అచ్చారావు.

డెబ్బయ్ ఏళ్ళ వయసున్న రాజయ్య సన్నకారు రైతు. అతనికి రెండెకరాల పొలం ఉంది. పాలకూర, చుక్కకూర లాంటి ఆకు కూరలు, బెండ, వంగ లాంటి కూరగాయలు సాగుచేసుకుంటూ తన ఊహతెలిసిన దగ్గర్నుండి ఆ పొలం పండించుకుంటూ గుట్టుగా గౌరవంగా జీవనం సాగిస్తున్నాడు.

అతనికి ఇద్దరు కూతుళ్ళు, ఇద్దరు కొడుకులు. "పిల్లలంటే... రాజయ్య పిల్లలే..." అంటారు అందరూ. అంత సఖ్యంగా ఉంటారు వాళ్ళు. కూతుళ్ళిద్దరూ అందగత్తెలు, గుణవంతురాళ్ళు అవటంతో తక్కువ కట్నంతో మంచి సంబంధాలే వచ్చాయి. పెద్దకొడుకు ఇంటర్మీడియట్ చదివి పట్నంలో ఏదో ఫ్యాక్టరీలో గుమాస్తాగా స్థిరపడ్డాడు. స్వంతంగా చిన్న అపార్టుమెంటు కూడా కొనుక్కున్నాడు. రాజయ్య చిన్న కొడుక్కి చదువబ్బలేదు. ఊళ్ళోనే తండ్రితోపాటు అదే పొలంలో పనిచేస్తాడు. కూరగాయల వ్యాపారం కూడా చేస్తాడు.

పండగలొచ్చినా, పబ్బాలొచ్చినా నాలుగు గదుల రాజయ్య ఇల్లు సంతోషంతో కళకళ్ళాడిపోతుంది. అతని నలుగురు పిల్లలు, వాళ్ళ జీవిత భాగస్వాములతో, పిల్లలతో ఆ ఇల్లు పండగ అన్న పదానికి ప్రతీకలా ఉంటుంది. అరమరికలు లేకుండా కలిసిపోయి తలో పని చేసుకుంటూ, నొప్పించని హాస్యంతో సరదాగా ఉండే కూతుళ్ళని, కోడళ్ళని చూసినా... చతురోక్తులేసుకుంటూ కులాసాగా కబుర్లుచెప్పుకునే కొడుకులను, అల్లుళ్ళని చూసినా రాజయ్య మనసు అలవికాని ఆనందానికి లోనవుతుంది.

"మన పిల్లలు నువ్వు లేని లోటు ఏనాడు నాకు తెలీనివ్వటం లేదు. కళ్ళతో సూసుకోటానికి నీకే ఈ అదురుట్టం లేకపోయింది..." చాలాసార్లు వాపోయాడతను భార్య ఫొటో ముందు నిలబడి. నాలుగేళ్ళ క్రితం రాజయ్య భార్య చనిపోయింది.

సంతృప్తికరమైన కుటుంబ జీవనం సాగిస్తున్న రాజయ్యకు... ఊహించని విధంగా తన పొలం ఇంత పెద్ద మొత్తం ధర పలకటం చాలా ఆనందాన్నిచ్చింది.

"రెండెకరాలకి అరవై లచ్చలొస్తాయి..." రాజయ్య ఉద్వేగంతో ఊగిపోయాడు. సంవత్సరం క్రితం లక్ష రూపాయలు కూడా చెయ్యని ఆ మెట్ట భూమి ధర... అమాంతంగా ఇన్ని లక్షల ధర పలకడం ఎవరికైనా జాక్‌పాట్ కొట్టిన అనుభూతినిస్తుంది కదా!

పొలం అమ్మేసుకోవాలంటే రాజయ్యకు మనసులో ఏదో మూల ముల్లుతో గుచ్చినట్టన్పిస్తోంది. ఎందుకంటే అతనికి ఊహతెల్సిన నాటి నుండి ఆ మట్టిని నమ్ముకునే బ్రతికేడు. పండీపండక ఆ భూమి అతని నమ్మకాన్ని వమ్ముచేసినా...

**"రెండెకరాలకి అరవై లచ్చలొస్తాయి..." రాజయ్య ఉద్వేగంతో ఊగిపోయాడు. సంవత్సరం క్రితం లక్ష రూపాయలు కూడా చెయ్యని ఆ మెట్ట భూమి ధర... అమాంతంగా ఇన్ని లక్షల ధర పలకడం ఎవరికైనా జాక్‌పాట్ కొట్టిన అనుభూతినిస్తుంది కదా!**

ఇంటి వైద్యం
★ కటుక రోహిణి మరియు అతిమధురము (యష్టిమధు) చూర్ణాన్ని వేడి నీటితో సేవిస్తే హృద్రోగము తగ్గుతుంది.

అతను నమ్ముతూనే ఉన్నాడు. అలాంటి భూలచ్చిని అమ్మాలన్న తలుపే అతనికి బాధగా ఉంది.

"అమ్మటం, అమ్మకపోవటం తరవాత మాట! తనిష్టం! భూమి రేటు పెరిగినాది. అది సంతోషించాల్సిన ఇషయం..." అనుకున్నాడు రాజయ్య.

రాజయ్యకు కాలు నేలమీద నిలవటం లేదు. ఇంటికి వడివడిగా అడుగులేస్తూ చేరాడు...

"రత్నం...సాంబయ్య ఏడి?!..." అడిగేడు కోడల్ని.

"బెండకాయలు కొంటానని కాపవరం వెళ్ళారు. ఈపాటికి వచ్చేస్తారు..." అంది రాజయ్య ముడుతలు పడిన ముఖంలోని సంతోషాన్ని ఆశ్చర్యంగా చూస్తూ...

అప్పుడే స్కూలునుండి వచ్చింది రాజయ్య ఆఖరి మనవరాలు రవళి. ఆ పిల్లని ఎత్తుకుని...ముద్దులు పెట్టుకుని... "అదురుష్టం అంతా నీదేనే!..." అన్నాడు రాజయ్య మురిసిపోతూ.

ఇంతలో... మోపెడ్ మీదనుండి బెండకాయల బస్తా దించి...ఇంట్లో అడుగుపెట్టాడు సాంబయ్య... రాజయ్య చిన్న కొడుకు.

అచ్చారావు చెప్పిందంతా గుక్కతిప్పుకోకుండా సాంబయ్యతో చెప్పేడు రాజయ్య. సాంబయ్య ముఖం సంతోషంతో విప్పారింది. భార్యవైపు చూసాడు. ఆమె ముఖం కూడా కాంతివంతమయింది.

"నీ సెల్లుఫోనులో సుందరం నెంబరు నొక్కి ఇయ్యి. ఈ సంగతి విని ఆడుకూడా సర్దాపడ్తాడు..." అన్నాడు రాజయ్య.

సాంబయ్య ముఖంలో కాంతి తగ్గింది... "అన్నయ్యకా... నేను తర్వాత చేస్తాలే. సెల్‌లో ఇప్పుడు డబ్బులు లేవు..." అన్నాడు.

కోడలి ముఖం నల్లపడటం రాజయ్య దృష్టిలో పడలేదు.

కాళ్ళు చేతులు కడుక్కొచ్చి, భోజనానికి కూర్చున్నాడు సాంబయ్య.

అన్నం వడ్డించింది రత్నం.

"నేను ఆర్నెల్లునుండి చెవినిల్లుకట్టుకుని పోరుతున్నాను. మీ నాన్న చేత వ్రాయించుకుని, ఆడపడుచుల చేత, బావగారి చేత సంతకాలు చేయించుకోమని! వింటేనే?!..." భర్తకు మాత్రమే వినపడేలా అంది రత్నం.

"ఇప్పుడేమయింది..." అర్థంకాక అడిగేడు సాంబయ్య.

"ఏమయింది. ఆస్తి రేటు ఎన్నో రెట్లు పెరిగింది. ఇన్ని లక్షల ఆస్తిని ఎవరు మాత్రం వదిలేస్తారు..." విసవిసలాడింది రత్నం.

"వాళ్ళేం అలా చెయ్యరు..." అన్నాడు సాంబయ్య. అప్రయత్నంగా అతనికి ఆర్నెల్లక్రితం జరిగిన సంక్రాంతి పండగ గుర్తొచ్చింది...

* * *

"పాకం గారెలు అవిరిపోయాయి..." అంది అనసూయ. రాజయ్య పెద్ద కూతురు.

"ఆవడ గారెలు కూడా..." అంది సుభద్ర. రాజయ్య చిన్న కూతురు.

"అన్నీ బావున్నాయంటున్నారు. బావున్నాయి... అవిరిపోయాయి లాంటి మాటలు విని విని బోరుకొడుతోంది. బాగా లేనివి ఏమిటో చెప్పండి..." అన్నాడు సాంబయ్య.

"ఏం బావలు... మీరిద్దరూ ఏమీ మాట్లాడటం లేదు. మా ఇంటి వంటలు రుచిస్తున్నాయా?!..." అడిగేడు సుందరం.

"వండినది మీ అక్కలా... బాగోకపోవటానికి! మా చెల్లెళ్లు వండిన వంటకు సలాం కొట్టవలసిందే ఎవరైనా..." అన్నాడు అనసూయ భర్త రామం.

"కరెక్ట్‌గా చెప్పేవు అన్నయ్యా..." వంత పలికేడు సుభద్ర భర్త సుబ్బారావు.

భోజనాలయ్యాక చావిట్లో అందరూ సమావేశమయ్యారు. అనసూయ తండ్రితో... "నాన్న...నన్ను, సుభద్రని మంచి ఇళ్ళకు కోడళ్ళని చేసావు. అమ్మ లేదన్న మాటే కాని... ఆ లోటు తెలియకుండా మరదలు బాగా చూసుకుంటోంది. పెద్ద తమ్ముడు సుందరం పనికూడా బాగానే ఉంది.

"చిన్న వాడైన సాంబయ్యే కూరగాయలు అమ్ముకుని బ్రతుకీడుస్తున్నాడు. తాతయ్య ద్వారా నీకు సంక్రమించిన రెండెకరాల పొలం, ఈ పెంకుటిల్లు... వాడికే ఇచ్చేస్తే బావుంటుంది. ఏమంటావు సుందరం..." అంది.

"నేను నాన్నతో ఇదివరకే చెప్పేను. అపార్టుమెంట్ కొనుక్కున్నాను. నెలకు ఏడెనిమిది వేలు సంపాదిస్తున్నాను. తమ్ముడి పరిస్థితికంటే నా పరిస్థితి మెరుగ్గా ఉంది. ఆ పొలం ఇల్లూ వాడికే ఇచ్చేయమని నాన్నతో చెప్పేను..." అన్నాడు సుందరం.

"మా ఆయన కూడా అలానే అన్నారు. వాటాల జోలికి పోకుండా సాంబయ్యకు పొలం, ఇల్లూ ఇచ్చేయండి..." అంది సుభద్ర.

"మీ ముగ్గురికి మతిగాని లేదా!! అందరం నాన్న పిల్లలమే... ఎవరి అదృష్టంకొద్దీ వాళ్ళకి కలిసొస్తుంది. మీకున్నది మీరు సంపాదించుకున్నదే కాని నాన్న ఇచ్చింది కాదుగా... నాన్న ఆస్తి కాణీ ఉన్నా అందరం హక్కుదారులమే... నాకలా ఏంవద్దు..." అన్నాడు సాంబయ్య ముఖమాటంగా!

"నువ్వు చిన్నవాడివి సాంబయ్య! మధ్యలో మాట్లాడకు. నువ్వు మేం చెప్పినట్టు చెయ్యి నాన్న..." అంది అనసూయ.

"పది రూపాయలుంటే, నాకంటే నాకని కొట్టుకుచచ్చే ఈరోజుల్లో ఇట్టాంటి పిల్లలు ఎవరికుంటారు..." గర్వంగా అనుకున్నాడు రాజయ్య.

"మీరు ఇలా సఖ్యతగా, ఒకరంటే ఒకరు ఆపేక్షతో సల్లంగుండండి. అంతకంటే నాకేటి కావాలి..." ఆనంద బాష్పాలు తుడుచుకున్నాడు రాజయ్య.

* * *

సంక్రాంతి పండుగ రోజున జరిగిన ఆ సంఘటన గుర్తుచేసుకుని "అక్కలు, అన్నయ్య మారరు..." దృఢంగా అన్నాడు సాంబయ్య.

"చూద్దాం..." అంది రత్నం.

* * *

రోజూ... మధ్యాహ్నం ఓ కునుకు తీయడం రాజయ్యకి అలవాటు. కాని ఆరోజు నవ్వారు మంచం మీద ఎంత పొర్లినా అతనికి నిద్ర రావటం లేదు. "అరవై లక్షలు..." అతను కలలో కూడా ఊహించలేదు. తన కొద్దిపాటి ఆస్తి అంత ధర పలుకుతుందని. అతని తండ్రి ఆ పొలాన్ని ఎకరా వంద రూపాయలకు కొన్నానని చెపుతుండేవాడు.

ఇక పడుకోలేక లేచెళ్ళి... వీధి చివరన ఉన్న కాయిన్ బాక్స్ ఫోనునుండి పెద్ద కొడుక్కి, కూతుళ్ళిద్దరికి ఫోనుచేసి ఈ విషయం చేరవేసాడు."

పొలం అమ్మనని, కేవలం రేటు పెరగటమే తన ఆనందానికి కారణమని వాళ్ళకు చెప్పేడు.

* * *

మర్నాడు...

వీధిలో ముగ్గు వేస్తోంది రత్నం.

అరుగుమీద కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు రాజయ్య.

సాంబయ్య కూరగాయలను బస్తాలో వేసి కుడుతున్నాడు. ఇంతలో రిక్షాలు ఒకదానివెంట ఒకటి వచ్చి ఆగేయి ఇంటిముందు.

రాజయ్య పెద్దకొడుకు, కూతుళ్ళిద్దరూ కుటుంబాలతో సహా వచ్చేసారు. పిల్లలందర్ని చూసేసరికి రాజయ్యకు సంబరంగా అన్పించినా... మనసులో ఏదో మూల అసౌకర్యంగా అన్పించసాగింది.

సాంబయ్య, రత్నం ముఖాలు నల్లబడ్డాయి. "చూసారా... నేనన్నది కరెక్ట్..." అన్నట్టు భర్తవైపు చూసింది రత్నం.

"రండి... రండి..." చిరునవ్వు ముఖానికి పులుముకుంటూ ఆహ్వానించాడు సాంబయ్య.

కుశల ప్రశ్నలు, టీ ఫలహారాలు అయ్యాక అందరూ చావిట్లో సమావేశమయ్యారు.

"పొలం...అందరం కలిసి తమ్ముడికి వదిలేద్దాం అనుకున్నాం. అప్పుడు ఎకరం యాభైవేలే కాబట్టి... పోనీలే అనుకున్నాం. కాని ఇప్పుడు ఎకరం ముప్పయ్ లక్షలైయింది. అంత డబ్బు ఎలా వదులుకోగలం?!... మా వాటాలు మాకు పంచి ఇయ్యి..." చల్లగా చెప్పింది అనసూయ తండ్రితో.

(మిగతా 27వ పేజీలో)

## స్వపరిచయం



కథలను అమితంగా ఇష్టపడటమే కథలు రాయడానికి నాకు ప్రేరణ. మంచి నవల గానీ, కథకానీ చదివితే నన్ను నేనే మరిచిపోతుంటాను.ప్రస్తుతం సామర్లకోట గౌతమి మోడల్ స్కూలు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నాను. ఆదివారం ఆంధ్రభూమి కథల పోటీలో నా కథకు బహుమతి రావడం నాకు మాటలకందని మధురానుభూతిని కల్గించింది.

**పెన్మెత్స శ్రీకాంత్‌రాజు,**
**ఇం.నెం.18-3-29, సత్తెమ్మ టెంపుల్ స్ట్రీట్,**
**అయోధ్యరామాపురం, సామర్లకోట- 533 440**
**తూ.గో.జిల్లా.**



**"అరవై లక్షలు..." అతను కలలో కూడా ఊహించలేదు. తన కొద్దిపాటి ఆస్తి అంత ధర పలుకుతుందని. అతని తండ్రి ఆ పొలాన్ని ఎకరా వంద రూపాయలకు కొన్నానని చెపుతుండేవాడు. ఇక పడుకోలేక లేచెళ్ళి... వీధి చివరన ఉన్న కాయిన్ బాక్స్ ఫోనునుండి పెద్ద కొడుక్కి, కూతుళ్ళిద్దరికి ఫోనుచేసి ఈ విషయం చేరవేసాడు."**



ఇంటి వైద్యం
★ గన్నేరు (కరవీర): గన్నేరు యొక్క కాండము యొక్క ఆల్కహాల్ ఎక్స్‌ట్రాక్ట్‌నందు ఉపయుక్తంగా ఉంటుంది.

(19 పేజీ తరువాయి)

రాజయ్య ఖిన్నుడయ్యాడు. అతనికి ఏ మూలో ఏదో ఆశ... పిల్లలు మామూలుగా చూడటానికి వచ్చారేమోనని. అది కాస్తా పోయింది.

"మాకు ఏదో కొంత ఆస్తి ఉన్నప్పటికీ... ఇంత డబ్బు ఎలా వదులుకోగలం నాన్నా... మాకూ పిల్లలున్నారుగా..." వంతపాడింది సుభద్ర.

"మీకు పెళ్ళిళ్ళయి చాలా కాలమైయిందిగా అక్కా... ఇవ్వవలసినది నాన్న అప్పుడే ముట్టజెప్పేడు కదా..." అన్నాడు సాంబయ్య మెల్లగా...

"ఏందిరా ముట్టజెప్పింది. నాలుగువేలు కట్నం. నాలుక్కాసుల బంగారం. మాకు పెట్టిందేముంది. అయినా అది తాత సంపాయించిన ఆస్తి. చట్టాలు మారేయి. మాకూ హక్కుంది..." తేల్చింది అనసూయ.

"నాకు కూడా ఎన్నో ఇబ్బందులు. ఏదో ఫ్లాట్ కొన్నానని పేరేగాని ఆ అప్పు ఇంకా తీరలేదు. పిల్లల చదువులు అవీ... బోల్డండ ఖర్చు..." నసిగేడు సుందరం.

"అలా మెల్లగా మాట్లాడతారేమండీ... ఆడపిల్లలే అంత గట్టిగా హక్కుల గురించి అడుగుతుంటే! మన వాటా మనకి పంచి ఇవ్వమని చెప్పండి..." గట్టిగా అంది సుందరం భార్య.

వాళ్ళు మాట్లాడుతున్న ఒకోమాట... ఒక్కో శరంలా గుచ్చుకుని రాజయ్య వృద్ధ హృదయాన్ని గాయపరచసాగాయి.

"ఎంతో సఖ్యతగా ఉండే నా పిల్లలేనా వీళ్ళు... డబ్బు మరీ ఇంత పాపిష్టిదా..." కుమిలిపోతూ అనుకున్నాడు రాజయ్య.

"పొలం అమ్మే ఉద్దేశ్యం లేదు. నా ఘటం వెళ్ళిన తర్వాతే ఏదైనా..." తేల్చి చెప్పాడు రాజయ్య.

"అయితే ఆస్తి వాటాలువెయ్యి నాన్నా. నీది నువ్వుంచుకో... మాది మేం అమ్ముకుంటాం..." అంది అనసూయ.

"అంతే! మాకు ఇన్నేళ్ళు వచ్చాక కూడా నువ్వు వాటా పంచననటం చట్టప్రకారం చెల్లదు..." అంది సుభద్ర బెదిరిస్తున్నట్టుగా...

రాజయ్యకు అర్థమయింది... వాళ్ళు లాయర్ని కలిసి... అన్ని వివరాలు కనుక్కుని పకడ్బంది వ్యూహంతో వచ్చారని.

"ఇప్పుడున్న రేటు మళ్ళీ రాకపోవచ్చు... అమ్మేసి డబ్బు చేసుకుంటేనే గొడవుండదు..." అన్నాడు సుందరం.

అప్పటివరకూ సౌమ్యంగా ఉన్న సాంబయ్య ముఖం కోపంతో జేవురించింది.

"మీరు వాటాలు వద్దన్ననాడే ఆ పొలంమీద మీకు హక్కు పోయింది. పొలం రేటు పెరిగిందంటే అవి నా అదృష్టం, నా పిల్లల అదృష్టం. తగుదునమ్మా... అని మళ్ళీ ఎలా తయారయ్యారు?!..." అక్కసు వెళ్ళగక్కేడు సాంబయ్య.

"ఆ?!... ఈ అదృష్టంలో మీకు వాటా ఉండబట్టే నా పేరున వ్రాసి అందరూ సంతకాలు పెట్టలేదు. అలా పెట్టుంటే ఇప్పుడు ఏడ్చి గీపెట్టినా ఒక్క రూపాయి విదిల్చేవాడివా?!..." అంది సుందరం భార్య. మరిది సాంబయ్యని.

"నా పెళ్ళప్పుడు నాలుగువేలు కట్నం ఇచ్చావు... సుభద్రకి ఎనిమిది వేలు ఇచ్చావు. అప్పటి నాలుగు వేలు ఇప్పుడు లక్షతో సమానం. నాన్నా నాకో లక్ష ఎక్కువ ఇవ్వాలి... నీ వాటాలోంచి..." అంది అనసూయ.

"ఆ... నీకు జరిపినట్టు లాంఛనాలు నాకు జరపలేదుగా..." దీర్ఘం తీసింది సుభద్ర.



ఆ నేలమీద, చదునుగా ఉన్నచోట వెల్లకిలా పడుకుని... చందమామ వైపు చూస్తూ... చెదిరిన తన కుటుంబాన్ని తలచుకుని గుండె వ్రక్కలవగా ఏడ్చేడు... గత వారం రోజులుగా జరుగుతున్న సంఘటనలన్నీ కలలైపోతే బావుణ్ణు అనుకున్నాడు. అదంతా కలేనేమోలే అనుకున్నాడు. కాసేపు కళ్ళు మూసుకుని తెరిస్తే ఆ పీడకల పోతుందనుకుని కనులు మూసుకున్నాడు.

"చదువు పూర్తవ్వగానే ఇంట్లోంచి రెక్కలతో బయటపడ్డాను. ఇప్పటివరకూ ఆ పొలంమ్మీది ఒక్క రూపాయి ముట్టలేదు. నాన్న వాటాకొచ్చిన డబ్బులోంచి ఆ మొత్తం నాకు ఇవ్వాల్సిందే..." అన్నాడు సుందరం.

"ఇన్నాళ్ళూ మావగార్ని మేమే చూసాం. ఈరోజుల్లో ముసలాళ్ళకి ఎవరు చేస్తారు. పదేళ్ళనుండి ఆయన్ను మేమే చూస్తున్నాం. పొలం మాకే ఆశ పెట్టేరు. రేటు పెరగ్గానే రాబందుల్లా దాపురించారు..." నోరు జారింది రత్నం.

"ఇంటి ఆడపడుచులం... మమ్మల్ని రాబందులంటావా?!..." అంటూ అనసూయా, సుభద్ర రెచ్చిపోయారు.

కొట్టుకునే పర్యంతం అయిన వాళ్ళని శాంతింపచేయటానికి రాజయ్య తల ప్రాణం తోకకొచ్చింది. కుటుంబ కలహం వీధిన పడటంతో రాజయ్యకి అర్థమైయింది తను పొలం అమ్మనన్నా పిల్లలు వదలరని... అమ్మేసి డబ్బు పట్టుకుని కాని తిరిగి వెళ్ళరని. పొలం అమ్మటానికి ఒప్పుకోక తప్పలేదు రాజయ్యకు.

ఇంటికి ధర కట్టించి కావాలంటే సాంబయ్యను తీసుకోమన్నారు. కాని అతను పట్నం వెళ్ళిపోతానని చెప్పడంతో ఇల్లుకూడా అమ్మకానికి పెట్టేసారు.

రియల్ ఎస్టేట్ వాళ్ళు రావటం, డబ్బివ్వటం, అందరి సంతకాలు తీసుకోవటం జరిగిపోయింది.

వేలిముద్ర వేసి బావురుమంటూ కుప్పకూలిపోయాడు రాజయ్య.

"ఇంత డబ్బిస్తుంటే... ఇంకా ఏడుస్తావేందయ్యా..." కొనుక్కున్నే అతను చిరాకుపడుతూ అన్నాడు.

కూతుళ్ళూ, కొడుకులూ కూడా ఓ వెర్రివాడ్ని చూసినట్టు చూసేరు.

"ఆ మట్టి ఇక తనదికాదు. గాలికి మెల్లగా తలలూపే ఆ పచ్చదనంతో రుణం తీరిపోయింది. కట్టుకున్న కొంప పరాయివాళ్ళ పాలయింది. పిల్లల మధ్య తగవులొచ్చి... గూడుచెదిరిపోయింది..." మూగగా రోదించిందతని మనసు.

సరదాగా కబుర్లు చెప్పుకుంటూ... ఒకరికొకరన్నట్టుండే కుటుంబ సభ్యులు...

"ఈ రిజిష్ట్రేషన్ అవనీ... మీ ముఖాలు చూస్తామా ఈ జన్మలో..."

"నీ గుమ్మం తొక్కాల్సిన అవసరం నాకేంటి?!..."

"నీ ఇంట మళ్ళీ చెయ్యి కడుగుతామా?!..."లాంటి సూటిపోటి మాటలు మాటాడుతుండటంతో ఆ ఇల్లు నరకానికి నకలుగా మారిపోయింది.

నాలుగురోజులు గడిచేసరికి రాజయ్య బాగా కృంగిపోయాడు. అతనికొచ్చే వాటా తాలూకు డబ్బుకోసం కూడా పిల్లలు కొట్లాడుతుండటంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు.

రిజిష్ట్రేషన్ అయిపోయింది.

తెల్లారితే ఇల్లూ పొలం కొన్నవాళ్ళకు అప్పగించి... ఊరు విడిచి వెళ్ళిపోవాలి.

రాజయ్యకి కంటి మీద కునుకు లేదు.

"తను పుట్టిపెరిగిన ఇంట్లో ఇది ఆఖరి రాత్రి..." విషాదంగా నవ్వొచ్చింది అతనికి.

వచ్చిన డబ్బుతో ఏమేం చెయ్యాలో ఆలోచించుకోసాగారు, అతని కొడుకులు, కూతుళ్ళు... వాళ్ళ వాళ్ళ గదుల్లో.

రాజయ్య చప్పుడు చేయకుండా లేచి పొలంవైపు వెళ్ళాడు.

తల్లిని వెతుక్కుని వెళ్ళే లేగదూడలా ఆ నిశిరాత్రి పొలం చేరుకున్నాడు.

ఆ మట్టిని ఆప్యాయంగా తడిమేడు. ఆ మొక్కల్ని ప్రేమగా స్పృశించాడు. కాయల బరువుతో వంగిన వంగ, టమాట మొక్కల్ని మృదువుగా తట్టేడు.

ఆ నేలమీద, చదునుగా ఉన్నచోట వెల్లకిలా పడుకుని... చందమామ వైపు చూస్తూ... చెదిరిన తన కుటుంబాన్ని తలచుకుని గుండె వ్రక్కలవగా ఏడ్చేడు... గత వారం రోజులుగా జరుగుతున్న సంఘటనలన్నీ కలలైపోతే బావుణ్ణు అనుకున్నాడు. అదంతా కలేనేమోలే అనుకున్నాడు. కాసేపు కళ్ళు మూసుకుని తెరిస్తే ఆ పీడకల పోతుందనుకుని కనులు మూసుకున్నాడు.

తీరా కళ్ళుతెరిస్తే పీడకల మళ్ళీ ప్రత్యక్షమవుతుందేమోనని భయపడుతూ కన్నుమూసేశాడు రాజయ్య.

★



ఇంటి వైద్యం

★ ఏలకులు (ఇలాచి) 250 మి.గ్రా. లేదా మిరియాలు (మారిచము)-1-2 గ్రాముల చూర్ణం తేనెతో కలిపి రోజుకు రెండుసార్లు సేవిస్తే ఎక్కిళ్ళు తగ్గుతాయి.